క్లుప్తంగా

చిన్నమల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

అంబాజీపేట: గంగలకుర్రులో వేంచేసియున్న సర్వమంగళ పార్వతీ సమేత చిన్నమల్లేశ్వర స్వామి, ఉమా సమేత ఆనందేశ్వర స్వామి వార్లకు మంగళవారం లక్ష బిల్వార్చన చేశారు. అలాగే మాచవరం పార్వతీ రాజరాజేశ్వరి స్వామి, కందుల మల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు వ్యాఘ్రేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, లక్షపత్రి పూజలు చేశారు. నందంపూడి, తొండవరం, వాకలగరువు, చిరతపూడి తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులపై ప్రత్యేక దృష్టి



మొగలికుదురులో హైరిస్క్ ప్రెగ్నెన్సీకి వైద్య పరీక్ష చేస్తున్న ప్రశాంత్‌కుమార్

మామిడికుదురు: హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆయన వైద్య సిబ్బందితో కలసి మంగళవారం మొగలికుదురులో హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసును పరిశీలించారు. ఆమెకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నగరం పీహెచ్‌సీ పరిధిలో ప్రస్తుతం 30 మంది గర్భిణులు ఉన్నారని చెప్పారు. అయిదు హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులను గుర్తించామన్నారు. ఎప్పటికప్పుడు వారి ఇంటికి వెళ్లి వారికి వైద్య పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వారిని చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. ఆయన వెంట సీహెచ్‌ఓ కె.సత్యవతి, ఏఎన్ఎం ఒ.మల్లేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.దీపిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి రూ.10 వేల సాయం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: గ్రామానికి చెందిన ముద్రగడ జాన్ పంచాయతీలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం పని చేస్తుండగా కంటిలో పుల్ల గుచ్చుకుని కన్ను కనబడటం లేదు. ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. కన్ను కనపడకపోవడం వల్ల పనిలోకి వెళ్లలేక వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవాసంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో మంగళవారం కొత్తకాలనీలో జాన్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.10 వేల చెక్కు అందజేశారు.

ఎస్సీ సొసైటీ షటిల్ కోర్టు ప్రారంభం



షటిల్ కోర్టు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. అంబేడ్కర్ నేతృత్వంలో రచించిన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సీ సొసైటీ ప్రతినిధులు అంబటి సత్యనారాయణ, బీర ఇస్సాక్ తదితరుల ఆధ్వర్యంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అందరూ రాజ్యాంగ స్ఫూర్తితో సమైక్యంగా ముందుకు సాగాలన్నారు. దేహ దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివసరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

అయినవిల్లి: మండలంలోని విలసలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ నిషాంతి, కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్‌లు మంగళవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఏ రకమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి జేసీ ఆదేశించారు. అనంతరం రైతులతో చర్చించారు. మండలంలోని ఇప్పటి వరకూ 600 ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్లు ఏఓ వై.శోభ తెలిపారు. 28 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు సూచించిన మిల్లర్లకు ధాన్యం పంపించే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వీరి వెంట తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీఓ భీమారావు తదితరులు ఉన్నారు.

వాతావరణం

- తుపాను హెచ్చరికలపై రైతుల ఆందోళన
- చురుగ్గా జరుగుతున్న పంట మసూళ్లు
- కళ్లాల్లోనే ధాన్యపు రాశులు – రైతుల కళ్లలో దైన్యం



సూర్యారావుపేటలో ఆరబెట్టిన ధాన్యాన్ని రాశులుగా పోసి సంరక్షించుకుంటున్న రైతులు

అలమూరు: బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి తుపాన్‌గా మారుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆలస్యమైన కారణంగా నవంబర్ నెలాఖరు వరకూ ఇంకా మాసూళ్లు జరుగుతున్నాయి. వరిపంట చేతికొచ్చే సమయానికి వరుస తుపాన్లు సంభవించడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి. ఇటీవల ఇప్పటికే మూడు తుపాన్లు రాగా మరోసారి బంగాళాఖాతంలో తుపాన్ ఏర్పడిందని తెలియడంతో రైతుల్లో కలవరం ప్రారంభమైంది. ఈ తుపాను ప్రభావం వల్ల మూడు రోజుల వరకూ పిడుగులు, ఉరుములతో పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలియజేయడంతో రైతుల కంటి మీదు కునుకు లేకుండా జీవిస్తున్నారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఖరీఫ్‌కు సంబంధించి 28,874 ఎకరాల్లో వరిసాగు జరిగింది. ఇప్పటికే కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 70 శాతం మేర పంటలోని ధాన్యం ఒబ్బిడి చేసుకోగా మిగిలిన రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో పంట ఇంకా పూర్తి స్థాయిలో కోయలేని పరిస్థితి. ఇప్పటికే గత తుపానుల ప్రభావం వల్ల అక్కడక్కడా వరిచేలు నేలకొరిగాయి. మరికొంత వరిపంట పనల మీద ఉంది. ఏ మాత్రం భారీ వర్షాలు కురిసినా పంట తీవ్రంగా దెబ్బతిని దిగుబడి తగ్గుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రహదారులపైనే ధాన్యపు రాశులు

ఖరీఫ్‌లోని పంట అందరికి ఒకేసారి అందుబాటులోకి రావడంతో మాసూళ్లు చేసిన ధాన్యంలోని తేమను ఆరబెట్టేందుకు రహదారులపై ధాన్యాన్ని రాశులుగా పోసి ఆరబెట్టారు. వాతావరణ



ఆలమూరులో ఈదురు గాలులు వీస్తూ మేఘావృతంగా ఉన్నా ఆకాశం

ప్రభావం వల్ల ఎండలు లేకపోవడంతో కూలీలతో ఉదయం సాయంకాలం ధాన్యంలోని తేమను తగ్గించేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో తుపాన్ వస్తుందని తెలియడంతో రహదారులపై వేసిన ధాన్యపు రాశులను సంరక్షించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ధాన్యం తడిసి ముద్దవుతుందనే మోనని భయాందోళన చెందుతున్నారు. ఏటా ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి తమ సహనానికి పరీక్ష పెడుతుందని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని అబ్బురపడుతున్న సమయంలో తుపాన్ హెచ్చరికలు రావడంతో రైతులను నిరుత్సాహానికి గురిచేస్తుంది.

ఉపాధి కోల్పోనున్న కార్మికులు

వరుస తుపానుల ప్రభావంతో ఇప్పటికే వ్యవసాయ, భవన నిర్మాణ, ఇటుక బట్టీ కార్మికులకు పూర్తిగా ఉపాధి లేకుండా పోయింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మళ్లీ చిన్నతరహా పరిశ్రమలు మరింత కాలం మూతపడి ఉపాధి కోల్పోయే ప్రమాదముందని కార్మికులు తీవ్ర మదన పడుతున్నారు. వరుస తుపానుల ప్రభావంతో ప్రజా జీవనం ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉంది. ఏ సమయంలో వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పాటు రహదారులన్నీ గోతులమయంగా మారిపోయి ప్రయాణమంటేనే హడలెత్తే ప్రమాదం ఏర్పడింది. వర్షాలు మళ్లీ కురిస్తే ఇక రోడ్డు ప్రయాణం చేయనక్కరలేని పరిస్థితి ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఆకట్టుకున్న శనైశ్చరుని రాక్షస సంహార నాటకం

- కార్తిక సాంస్కృతికోత్సవాల్లో మందపల్లి స్థల పురాణం
- విశేషంగా అలరించిన కూచిపూడి నృత్యరూపకం



మందపల్లిలో స్థల పురాణ నాటకం ప్రదర్శన

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి క్షేత్రంలో వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్తికమాసం చివరి సోమవారం సందర్భంగా దేవదాయ–ధర్మదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కాకినాడ సమీపాన మాధవపట్నం గ్రామానికి చెందిన పౌరాణిక, కూచిపూడి కళా బృందాల సభ్యుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వాటిలో మందపల్లి క్షేత్ర స్థల పురాణ ఘట్టాన్ని ప్రదర్శించారు. పూర్వం దారిపోయే బాటసారులను భక్షిస్తున్న ఇద్దరు రాక్షసుల బారి నుంచి కాపాడాలని ప్రజలు శని భగవానుని వేడుకోగా శనైశ్చరుడు ఆ రాక్షసులను సంహరించి ప్రజలను కాపాడతాడు. బ్రాహ్మణ సంతతికి చెందిన రాక్షసులను సంహరించిన కారణంగా బ్రహ్మహత్యాపాతకం తొలగించుకునేందుకు మందపల్లిలో ఈశ్వర లింగాన్ని ప్రతిష్ఠించి, జాతక రీత్యా తన దోషం తొలగించుకునేందుకు ఈశ్వర లింగాన్ని దర్శించుకుంటే ఆ దోషం తొలగిపోతుందని భక్తులకు వరమిచ్చిన విధానం ఆ కళాకారులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. అనంతరం కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా అలరించింది. మందపల్లి సర్పంచ్ సాదు వెంకటలక్ష్మి, సాదు చెంచయ్య, మాజీ సర్పంచ్‌లు చింతం విజయకృష్ణమోహన్, సిద్ధంశెట్టి వీవీ సత్యనారాయణ, దేవస్థానం మాజీ చైర్మన్ సలాది బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: డిసెంబర్ 5న జరగనున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మంగళవారం మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. గొల్లపల్లి పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రాజోలు నియోజకవర్గంలో మొత్తం 688 టీచర్ల ఓట్లు ఉన్నాయని ఆయా గ్రామాల్లో పట్టున్న నాయకుల ద్వారా పార్టీ మద్దతు ఇస్తున్న గంధం నారాయణరావుకు ఓట్లు వేసేలా కష్టపడాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో బొత్స సత్యనారాయణ గెలుపును స్ఫూర్తిగా తీసుకుని కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో కూటమి ప్రభుత్వం తీరుపై ప్రతి ఒక్కరూ అసంతృప్తితో ఉన్నారని, మాజీ సీఎం చేసిన అభివృద్ధితో పోల్చుకుంటున్న ప్రజలు కూటమిని ఎందుకు గెలిపించామని బాధ పడుతున్నారన్నారు. సమావేశంలో ఎంపీపీ మేకా మల్లిబాబు, గెడ్డం తులసీ భాస్కరరావు, ఈద రవిరెడ్డి, పాటి శివకుమార్, కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్, జక్కంపూడి వాసు, జి.బాబు, చెల్లింగి ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



కొత్తపేటలో రక్తదాతలను అభినందిస్తున్న ఆర్ఎస్ తదితరులు

కొత్తపేట: వివిధ ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో బాధపడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం అయినప్పుడు ఎక్కించే ఈ 'రక్తదానం ప్రాణదానం'తో సమానమని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం(ఆర్ఎస్) అన్నారు. జితేంద్ర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ అండ్ ఫౌండర్ మట్టపర్తి జితేంద్ర కుమార్ ఆధ్వర్యంలో అమలాపురం సహస్ర బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన శిబిరాన్ని ఆర్ఎస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జితేంద్ర కుమార్ సేవా ఫౌండేషన్ స్థాపించి ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సుమారు 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వారిలో 20 మంది విద్యార్థినులు ఉన్నారు. వారందరికీ ఫౌండేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, సహస్ర బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కడలి శ్రీహరి, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి మట్టపర్తి సూర్యచంద్రరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీని తలపిస్తున్న పంట కాలువ



మగటపల్లిలో పంటకాలువ దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

మామిడికుదురు: కొమరాడ నుంచి మగటపల్లి వరకు మూడు కిలోమీటర్ల మేర పంట కాలువ డ్రైనేజీని తలపిస్తోందని రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. పంట కాలువలోకి ఇళ్లలోని వాడకం గొట్టాలతో పాటు ఇతర మురుగునీటి తూరలు ఏర్పాటు చేయడం వల్ల పంట కాలువ పూర్తిగా డ్రైనేజీగా మారిపోయిందన్నారు. ఇది పూర్తిగా కుచించుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లకు సంబంధించిన తూరలను పంట కాలువలోకి ఏర్పాటు చేశారన్నారు. ఈ కాలువ కడలి మేజర్ డ్రైన్ వరకు ఇదే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి దీనిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో రైతులు కుంపట్ల బాబ్జి, నామన సూర్యనారాయణ, శ్రీను, సామ వెంకటస్వామి, నామన నర్సింహారావు, బొలిశెట్టి రాజు, పున్నం రామారావు, అడబాల గణపతి తదితరులు పాల్గొన్నారు.

వానపల్లిని సందర్శించిన విధుశేఖర భారతీస్వామి



వానపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన విధుశేఖర భారతి

కొత్తపేట: శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి, జగద్గురువులు విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి మంగళవారం రాత్రి వానపల్లి గ్రామాన్ని సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా విజయ యాత్రలో భాగంగా వానపల్లి విచ్చేసిన భారతీ మహాస్వామికి గ్రామ వేద విజ్ఞాన బ్రాహ్మణ సంఘం, వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆగమనం వేదఘోష, మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ మహాస్వాగతం పలికారు. తొలుత గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. వేద విజ్ఞాన బ్రాహ్మణ సేవా సంఘ భవనాన్ని సందర్శించారు. కొంతసేపు ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా భారతీ మహాస్వామికి సంఘ సభ్యులు గురువందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రముఖ జర్నలిస్ట్, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నేమాని భాస్కరరామం, డీసీసీబీ మాజీ పర్సన్ బండారు సత్తిరాజు (రాజా), సర్పంచ్ పల్లి భీమారావు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్ఈ రమేష్‌బాబు, బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లాప్రగడ హనుమంతరావు, విస్సాప్రగడ వెంకటసుబ్బారావు, వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్గిరెడ్డి జన్మదిన వేడుకలు

- కొత్తపేటలో 50 కేజీల కేక్ కటింగ్
- హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్ల పంపిణీ



కొత్తపేటలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి బర్త్ డే కేక్ కట్ చేస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు, వీరభద్రరావు తదితరులు

కొత్తపేట: స్థానిక మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిర్ల జగ్గిరెడ్డి జన్మదిన వేడుకలను కొత్తపేటలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు ఇంట ఘనంగా నిర్వహించారు. వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న జగ్గిరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఇక్కడ డేవిడ్‌రాజు తనయుడు, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొల్లపల్లి స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత జగ్గిరెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వీడియోకాల్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేయించిన 50 కేజీల జగ్గిరెడ్డి బర్త్‌డే కేక్‌ను డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ప్రముఖ వ్యాపారవేత్త కొప్పుల బూరిబాబు, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ తదితరులు సమైక్యంగా కట్ చేసి పరస్పరం తినిపించుకుని, అందరికీ పంచారు. ఆ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా పేల్చారు. అనంతరం స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంచారు. పలువురు మాట్లాడుతూ జగ్గిరెడ్డి నాయకత్వ పటిమను, పరిపాలనా దక్షత, దాతృత్వం, స్థానిక సమస్యలపై స్పందించడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. రాజకీయాల్లో జయాపజయాలను స్పోర్టివ్‌గా తీసుకునే జగ్గిరెడ్డి రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో అధికారాన్ని చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంద్రిగ వీడీసీ కన్వీనర్ దూనబోయిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పితాని రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు సలాది బ్రహ్మాజీ, బొక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను పాలకుడిని చేసిన రాజ్యాంగం

- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- అంబేడ్కర్ విగ్రహాలకు పలువురి నివాళులు



మలికిపురంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ మంత్రి గొల్లపల్లి



విశ్వేశ్వరాయపురంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: దేశాన్ని భిన్నత్వం నుంచి ఏకత్వం వైపు నడిపిన వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ అని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. రాజ్యాంగం ఆమోదం పొందిన దినోత్సవాన్ని మంగళవారం మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. మలికిపురం పూలే–అంబేడ్కర్ భవనంలో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు నివాళులర్పించారు.

మామిడికుదురు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని పలువురు వక్తలు ప్రస్తుతించారు. భారత రాజ్యాంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడికుదురు బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశానికే వెన్నెముక అని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల సర్పంచ్లు అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

పి.గన్నవరం: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు.

రావులపాలెం: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా డీఈవో షేక్ సలీం బాషా పాఠశాలను సందర్శించి ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణంలో ఒక మొక్కను నాటి, అనంతరం జెండా వందనం చేశారు.

రాజోలు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని రాజోలు బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. బార్ ఉపాధ్యక్షుడు చింతా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలో రచించిన భారత రాజ్యాంగం దేశానికి దిక్సూచిగా, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అన్నారు. తొలుత స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీ వద్ద గాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఎంపీడీఓ నరేష్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో శ్రీకర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలమూరు: భారత రాజ్యాంగ స్ఫూర్తిని అందరూ గౌరవిస్తూ ఆచరిద్దామని ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలసి ఆయన స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

సఖినేటిపల్లి: స్థానిక గ్రామ పంచాయతీలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భీమారావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఈ నెల 27 నుంచి 29 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పిన నేపథ్యంలో రైతులు తమ వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ జి.వెంకటేశ్వరి తెలిపారు. వరి చేలల్లో పనలపై ఉన్న వాటిని, కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యపు రాశులను తక్షణమే మెరక ప్రాంతానికి చేరవేయాలన్నారు. వర్షాలకు ఇబ్బందులు కలగకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని చెప్పామన్నారు.

నచ్చిన మిల్లులకు ధాన్యం అమ్ముకోవచ్చు

రాజోలు: రైతులు తమకు నచ్చిన మిల్లులకు ధాన్యం అమ్ముకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు అన్నారు. మంగళవారం ఆయన చింతలపల్లిలోని రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే కోతలు పూర్తయితే ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. రబీలో సాగు చేపట్టే పంటల రకాలు, మట్టి నమూనా వివరించే పత్రాలను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్, వీఏఏలు బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సేవలపై అవగాహన

మామిడికుదురు: మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతులకు చెందిన 91 మంది విద్యార్థులకు మంగళవారం రాజోలు మండలం తాటిపాకలోని షాపింగ్‌మాల్‌కు తీసుకువెళ్లి వినియోగదారులకు అందించే సేవలు, వ్యాపార లావాదేవీలపై అవగాహన కల్పించారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలలో రెండు వృత్తి విద్యా కోర్సులు ప్రారంభించారు. రిటైల్, ఫుడ్ ప్రాసెసింగ్ రిటైల్ విభాగాలకు సంబంధించిన వాటిని బోధిస్తున్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని పర్యవేక్షణలో వృత్తి విద్యాకోర్సు శిక్షకులు వై.మధు, జె.మౌనిక, టీచర్స్ ఎం.గంగాభవాని, షేక్ సుభాని, పి.జయప్రకాష్ మార్కెటింగ్ విజిట్‌లో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మేనేజ్‌మెంట్ పద్ధతుల అమలుపై అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఆక్వా కల్చర్‌లో మేనేజ్‌మెంట్ పద్ధతులపై వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆక్వా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ సుస్థిర జల కృషి కేంద్రం (నాక్సా)ఆధ్వర్యంలో ఎంపెడా, మినిస్ట్రీస్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ కింద నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఆక్వా కల్చర్‌పై రైతులకు యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) ప్రాముఖ్యతపై సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు ఎన్.శ్రీనివాసరావు సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపెడా సబ్ రీజినల్ డివిజన్ అధికారి డాక్టర్ వై.బంగారమ్మ, ఏడీ కె.శ్రావణి, ఎన్‌పీ చంద్రశేఖర్, రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్.బాలాజీ, ఫీల్డ్ మేనేజర్ సునీల్‌కుమార్, ఎల్.రాజేష్ పాల్గొన్నారు.

పొన్నమండ ఫీల్డ్ లేబర్ సొసైటీ కార్యవర్గం రద్దు

రాజోలు: పొన్నమండ ఫీల్డ్ లేబర్ సొసైటీ కార్యవర్గాన్ని రద్దు చేస్తూ సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.రాధాకృష్ణ మంగళవారం జారీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కుసుమ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నల్లి సూర్యం, సభ్యులు కుసుమ వెంకటేశ్వరరావు, పోతుల రాజారావు, ఉండ్రు రాజబాబులతో కూడిన కమిటీ రద్దు కావడంతో కొత్తపేట అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.చంద్రశేఖర్ ప్రత్యేకాధికారిగా నియమించారు. గతంలో జరిగిన ఎన్నికలు సక్రమంగా నిర్వహించలేదని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ నిర్వహించి కమిటీని రద్దు చేశారు.

కార్తిక వన సమారాధనలు

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం పెద్దఎత్తున వన సమారాధనలు జరిగాయి. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వనసమాధారనలో అంతటా ఆధ్యాత్మికత చోటు చేసుకుంది. పినపళ్లలో గ్రామస్తుల సహకారంతో జరిగిన ఈ అన్న సమారాధనలో పరిసర ప్రాంతాల నుంచి సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెదిరెడ్డి పట్టాభి, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే అలమూరులోని దుర్గాదేవి ఆలయంలో భారీ అన్నసమారాధన జరిగింది.

డిగ్రీ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ జరిగింది. కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహస్వామితో పాటు లెక్చరర్లు రూ రూ.25 వేలు సమకూర్చారు. వీటితో కొనుగోలు చేసిన రెండు జతల యూనిఫాంను కళాశాల ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి గారపాటి త్రిమూర్తులు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అధ్యాపకులు, సీనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దాళ్వా వరి సాగుపై రైతులతో సమావేశాలను అధికారులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నారుమడులను పలువురు రైతులతో కలిసి ఏవో పీవీ నరసింహారావు సందర్శించారు. నారుమడులలో సస్యరక్షణ చర్యలపై తగు సూచనలు ఏవో రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.